క్లుప్తంగా

ఎలక్ట్రికల్ వర్కర్స్ బైక్ ర్యాలీ

మామిడికుదురు/రాజోలు: సబ్సిడీ రుణాలు అందించి తమను ఆదుకోవడంతో పాటు తమకు సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ శ్రీనవదుర్గా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మూడు మండలాలకు చెందిన ప్రతినిధులు మామిడికుదురు సెంటర్ నుంచి నగరం మీదుగా రాజోలు మండలం తాటిపాక వరకు ఈ ర్యాలీ జరిపారు. కరోనాతో ఆర్థిక సంక్షోభం వల్ల జీవనోపాధి ఇబ్బందిగా మారిన తమకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలన్నారు. ఈ ర్యాలీలో మెడబల రామారావు, మామిడిశెట్టి సత్యనారాయణ, బత్తుల జనార్దనరావు పాల్గొన్నారు.

31న కొండాలమ్మ జాతర

మామిడికుదురు: పాశర్లపూడిలో కొలువైన కొండాలమ్మ జాతర ఈ నెల 31వ తేదీ మంగళవారం జరుగుతుందని ఉత్సవ కమిటీ శుక్రవారం తెలిపింది. అమ్మవారి జాతర మహోత్సవాలు 31వ తేదీ మంగళవారం నుంచి ఫిబ్రవరి 6వ తేదీ సోమవారం వరకు ఏడు రోజుల పాటు జరుగుతాయన్నారు. అనంతరం అన్న సమారాధనతో జాతర ముగుస్తుందన్నారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు గుర్తింపు


డైరెక్టర్ మస్తాన్ సాహెబ్

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ ద్వారానే బీసీలకు తగిన గుర్తింపు లభించిందని నూర్ బాషా కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్ సాహెబ్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బీసీల్లో ప్రధాన కులాలతో పాటు ఉపకులాలకు కూడా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారికి ఎన్నో సంక్షేమ పథకాలు అందించిందన్నారు. రెండో పర్యాయం తనకు స్టేట్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని, దీనికి సహకరించిన పార్టీ నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

స్వామివారి సన్నిధిలో ఆర్డీవో


అంతర్వేది ఆలయంలో ఆర్డీవో వసంతరాయుడు కుటుంబం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శుక్రవారం అమలాపురం ఆర్డీవో బి.వసంతరాయుడు కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. స్వామికి పూజల అనంతరం ఆశీర్వచనాలు తెలిపారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆయనకు అందజేశారు.

వేగంగా పనులు

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో తీర్థం పనులు మరింత వేగవంతమయ్యాయి. శుక్రవారం ఆలయం లోపల, వెలుపల ఐరన్ బారికేడ్లతో భక్తుల క్యూలు ఏర్పాటు చేశారు. అలాగే పశ్చిమ రాజగోపురం ముఖ్యద్వారం వద్ద షామియానాతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. వీటితో పాటు భక్తులను ఆకట్టుకునే రీతిలో దేవతామూర్తుల భారీ కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఎరువుల షాపులపై విజిలెన్స్ తనిఖీలు


విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన ఎరువుల బస్తాలు

రావులపాలెం: మండలంలోని ఈతకోట ఎరువుల షాపుపై శుక్రవారం విజిలెన్స్, వ్యవసాయ, లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు చేశారు. గ్రామంలోని వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు చేసిన విజిలెన్స్ అధికారులు స్టాక్ నిల్వల్లో తేడాలు గుర్తించారు. అలాగే అమ్మకం ధర కన్న ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. దీంతో రూ. 69,015 విలువైన సుమారు 6.315 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. క్రిబ్కో యూరియా గరిష్ట అమ్మకపు ధర రూ.266.50 ఉండగా రూ.300 లకు అమ్మకాలు చేస్తున్నట్టు గుర్తించి లీగల్ మెట్రాలజీ అధికారులు ఒక కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో సీఐ సత్యకిషోర్, తహసీల్దార్ విజయకుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంకలో శుక్రవారం అగ్నిబాధితురాలు పడవల ఆదిలక్ష్మికి, గ్రామస్తులు ఇరువురు కలిపి రూ.10 వేలు ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ఈ మేరకు సుంకరేవులో ఆదిలక్ష్మికి చల్లా నాగరాజు, యల్లమెల్లి కిషోర్ కలిపి రూ.5 వేలు చొప్పున సాయం చేశారు. ఎంపీటీసీ రుద్రరాజు వెంకట్రాజు, రేవూరి ఏసు రాజా, నడింపల్లి వెంకట సుబ్బరాజు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న పాలనే రావాలి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేట శివారు గ్రామాల్లో గడప గడపకూ

కొత్తపేట: ఈ మూడున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఏ విధమైన సమస్యలు లేకుండా ఆనందంగా జీవనం సాగిస్తున్నాం. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా, ఎమ్మెల్యేగా జగ్గిరెడ్డి కావాలని లబ్ధిదారులు ఆకాంక్షించారు. 'గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కొత్తపేట శివారు పెదగూళ్లపాలెం, రాణిగారితోట, చినగూళ్ళపాలెం తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం చేకూర్చిన పథకాల జాబితాలో వారి బ్యాంక్ అకౌంట్‌కు పడిన పథకాల నిధులు వివరించగా అవన్నీ అందాయని ఆ లబ్ధిదారులు ఆనందంగా చెప్పారు. మన ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసింది, చేస్తుంది. ఆ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా? లేదా? అని తెలుసుకుని, అందకపోతే అందించేందుకు, ఇంకా ఏమైనా సమస్యలు వుంటే పరిష్కరించేందుకే ఇంటింటికీ వస్తున్నామని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. ఆ పథకాలను సద్వినియోగం చేసుకుని అందరూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే సీఎం జగన్ ఆకాంక్ష అని అన్నారు. సీఎం జగన్‌పై, నా పై మీరు చూపుతున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మీ అభిమానంతో రాబోయే కాలంలో జగన్ ప్రభుత్వం మళ్లీ అధికారం చేపట్టి మరిన్ని పథకాలు అమలు చేస్తుందని జగ్గిరెడ్డి అన్నారు.


కొత్తపేట పెదగూళ్లపాలెంలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు

నియోజకవర్గ కేంద్రం కొత్తపేట మెయిన్ విలేజ్‌లో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.3.10 కోట్లతో నిర్మించే వాటర్ పైపులైన్, ట్యాప్‌ల నిర్మాణానికి పాత బస్టాండ్ సెంటర్‌లో, ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయం వద్ద రూ.23 లక్షలతో 3 ఫిషరీస్ ట్యాంకులు నిర్మాణానికి, పాత ట్యాంకులు రిపేర్లకు, పెదగూళ్ళపాలెం రామాలయం వద్ద రూ.5 లక్షలతో కమ్యూనిటీ షెడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మానందం, సర్పంచులు బూసి జయలక్ష్మి, రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని శంకరగుప్తంలో జరుగుతున్న చెడుగుడు పోటీలు ముగిశాయి. శుక్రవారం జరిగిన బహుమతుల ప్రదానంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ సంప్రదాయ క్రీడలను కాపాడుకోవాల్సిన అవశ్యత చాలా ఉందన్నారు. ఆధునిక క్రీడలతో పాటు సంప్రదాయ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. చెడుగుడు పోటీలలో ఫసక్ టీమ్ ప్రథమ బహుమతి సాధించగా ఆర్ఆర్-1 టీమ్ ద్వితీయ బహుమతి సాధించింది. కుమార్‌రాజు (భీమవరం టీమ్) తృతీయ బహుమతి సాధించింది. సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షుడు చింతా కుమార్‌రాజా అధ్యక్షతన జరిగిన సభలో వైఎస్సార్ సీపీ నాయకులు కేఎస్ఎన్ రాజు, జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, సర్పంచ్ రాపాక ఆనందకుమార్, మాజీ ఎంపీపీ ముత్యాల కాశీ, నేతల శ్రీనివాస్, ఓగూరి హనుమంతరావు, నక్కా రమేష్ బాబు, యడ్ల పెద్దిరాజు, కొంబత్తుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో అన్యమత ప్రచారం లేకుండా చూడాలి

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థమహోత్సవాల్లో అన్యమత ప్రచారం, మద్యం, మాంసం విక్రయాలు, అసాంఘిక కార్యక్రమాలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అంతర్వేది దేవస్థాన సంరక్షణ సమితి ప్రతినిధులు శుక్రవారం పలువురు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. అంతర్వేదికి విచ్చేసిన ఆర్డీవో వసంతరాయుడు, అంతర్వేది అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, సఖినేటిపల్లిలో తహసీల్దార్ రామకుమారి, ఎస్సై ఫణిమోహన్‌కు వారు ఈ పత్రాలను ఇచ్చారు. సమితి జిల్లా ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కార్యదర్శి డి.ప్రభాకరరావు వీటిని అందించారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

రావులపాలెం: రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఎంవీఐ వి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద డీపో మేనేజన్ కేడీఎంఎస్ కుమార్ ఆధ్యక్షతన జరిగిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రైవర్లు ఒత్తిడి లేకుండా వాహనాలు నడపాలన్నారు. జీరో యాక్సిడెంట్ దృక్పథంతో డ్యూటీ చేయాలన్నారు. డిపో మేనేజర్ కుమార్ మాట్లాడుతూ ప్రజా రవాణా సంస్థ నేటి నుంచి వచ్చే నెల 2 వరకూ రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. ప్రతి డ్రైవర్ మంచి ఆహార అలవాట్లు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్యారేజీ ఎంఎఫ్ నాగలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబ, డ్రైవర్లు, పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన


రావులపాలెంలో ఇంటింటికీ కుళాయి పథకం పనులకు శంకుస్థాన చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: శుద్ధి చేసిన గోదావరి జలాలను నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ ఇవ్వాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీఆర్‌సీ రోడ్డులో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి పథకంలో రూ.3.13 కోట్లతో నిర్మించనున్న వాటర్‌ట్యాంక్ పనులకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పనులకు భూమిపూజ చేసి కొబ్బరికాయ కొట్టారు. అలాగే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో బొబ్బర్లంక వద్ద గోదావరి జలాలను తీసుకుని శుద్ధి చేసి ఇచ్చేలా మెగా ప్రాజెక్టును నిర్మించామన్నారు. ప్రస్తుతం జాతీయ రహదారికి అవతలివైపు ఉన్న 3,150 ఇళ్లకు కుళాయి నీరు ఇచ్చేందుకు ఈ వాటర్‌ట్యాంక్ నిర్మాణం మొదలు పెట్టామన్నారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేసి వేసవి నాటికి అందుబాటులోకి ఇచ్చేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, వాడపల్లి దేవస్థానం డైరెక్టర్ మన్యం భాను, వార్డు సభ్యులు మల్లిడి నాగిరెడ్డి, సఖినేటి వాకులరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బీవీఎల్ నరసింహరావు, జేఈ కేవీవీ సత్యనారాయణమూర్తి, సెక్రటరీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో ఉత్తమ అవార్డులు పొందిన ముగ్గురికి శుక్రవారం ఘన సత్కారం జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో అవార్డులు సాధించిన పంచాయతీ కార్యదర్శి డి.సుబ్బారావు, గ్రామ సచివాలయ కార్యదర్శి కె.పద్మ, వీఏఏ పృథ్వీరాజ్‌లకు ఈ సన్మానం జరిగింది. గ్రామ పంచాయతీలో ఒకేసారి మూడు అవార్డులు సాధించిన వారందరికీ సర్పంచ్ రాంబాబు పూలమాల వేసి దుశ్శాలువ, మెమెంటోతో సత్కరించారు.

పురస్కార గ్రహీతలకు సత్కారం

సఖినేటిపల్లి: రిపబ్లిక్ డే పురస్కరించుకుని అమలాపురంలో ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న అధికారులకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సత్కారం చేశారు. తహసీల్దారు వై.రామకుమారి ఆధ్వర్యాన డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, వీఆర్వో సంఘం అధ్యక్షుడు వి.రామరాజులను రెవెన్యూ సిబ్బంది సత్కరించారు.

స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులకు మేలు

మామిడికుదురు: జగనన్న విద్యా భారతి పథకం ద్వారా విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గా ప్రసాద్, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, పీఎంసీ చైర్మన్ పిల్లి శ్రీను, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు పేర్కొన్నారు. పాశర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్రభుత్వం ఉచితంగా అందించిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అభిలషించారు. స్కూల్ హెచ్‌ఎం నాగోజీరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, స్థలదాత రాయపురెడ్డి శ్రీను, స్థానికులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో క్రతువుల ముగింపు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని సన్నిధిలో మూడురోజులుగా నిర్వహిస్తున్న విశేష పూజలకు శుక్రవారం పూర్ణాహుతితో వేదపండితులు ముగింపు పలికారు. వేదపండితులు, ఆలయ ప్రధానార్చకుల పర్యవేక్షణలో స్వామి సన్నిధిలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, సూర్యనమస్కారాలు, మహాపూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పం, చతుర్వేద స్వస్తి మహదాశీర్వచనం, ప్రసాద వితరణ వంటివి నిర్వహించారు.

పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు

మలికిపురం/సఖినేటిపల్లి/అంబాజీపేట/రాజోలు : గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలాపురంలో కలెక్టర్ హిమాన్షుశుక్లా, ఎంపీ అనురాధ చేతుల మీదుగా లక్కవరం పీహెచ్‌సీ వైద్యాధికారి మంగం దుర్గాప్రసాద్, అలాగే డీఆర్‌డీఏ వెలుగు గాను మండల మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు జి.సుమలత, శిరీష, గొల్లపాలెం వీవోఏ ఎం.మంగాదేవి ఉత్తమ వీవోఏగా పురస్కారం అందుకున్నారు. వీరిని వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఏపీఎం డి.వరాలబాబు అభినందించారు. సఖినేటిపల్లి విద్యుత్ మీటర్స్ రీడర్ ఎం.సోమనాథశాస్త్రిని శుక్రవారం పలువురు సత్కరించారు. అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన శానిటేషన్ మేస్త్రీ పితాని రాంబాబు పురస్కారాన్ని అందుకున్నారు. రాజోలు మండలం తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఫణికిరణ్, రాజోలు ఆర్‌అండ్‌బీ సబ్ ఇంజినీర్ యనమదల సత్యనారాయణ, రాజోలు అగ్నిమాపకాధికారి పి.గణేశ్వరరావు ఉత్తమ అవార్డులు అందుకున్నారు.

గర్భిణులకు సీమంతాలు


గర్భిణులకు సీమంతాలు చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: మండలంలోని పెనికేరులో శుక్రవారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం జరిగింది. స్థానిక సబ్ సెంటర్ వద్ద సర్పంచ్ వసుం చిన్నావతి, ఎంపీటీసీ యనమదల స్వాతి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, పి.ఉమ, వైద్యారోగ్య సిబ్బంది టి.సుశీల, కె.రాణి తదితరులు పరిసర ప్రాంతాలకు చెందిన 11 మందికి సీమంతాలు చేసి పసుపు కుంకుమ, నూతన వస్త్రాలు, పండ్లు పూలను అందజేశారు. అలాగే అరుగురు అంగన్‌వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి పలకలు, బలపాలను అందజేశారు. అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే భూతాపం

అంబాజీపేట: పర్యావరణానికి హాని కలిగించే చర్యలతోనే భూతాపం పెరిగి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని జాతీయ భూగర్భ వనరుల డెల్టా పరిశోధన శాఖ డైరెక్టర్ డాక్టర్ వైఆర్ సత్యాజీరావు అన్నారు. అంబాజీపేట వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రక్షిత వ్యవసాయ విధానాలపై నాబార్డు ఆధ్వర్యంలో వర్క్‌షాపును నిర్వహించారు. నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వైఎస్ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్యాజీరావు మాట్లాడుతూ తీర ప్రాంతాలలో రొయ్యలసాగు, అడువుల నరికివేత, కార్బన్ వ్యర్థాలు పెరగటం, తదితర కారణాల వల్ల సముద్రంలో లవణీయత పెరిగిపోతోందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, కోనసీమ జిల్లాలోని ఉప్పలగుప్తం మండలాల్లో అధికంగా రొయ్యల సాగు చేయడం వల్ల సముద్ర జలాలు కలుషితమవుతున్నాయన్నారు. నాబార్డు అనుబంధ రంగాలైన వ్యవసాయం, పశు సంవర్థక, మత్స్య, గ్రామీణాభివృద్ధి, సహకార బ్యాంక్ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయకుమార్, పశువైద్యాధికారి రాజేంద్రప్రసాద్, ఏపీవో అడపా వెంకటశ్రీకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

అయినవిల్లి: పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా ముక్తేశ్వరం సెంటర్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చి వాటి స్థానంలో ఎత్తు పెంచుతూ కొత్తవి ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ముక్తేశ్వరం నాలుగు రోడ్ల కూడలిలో ఏఈ హరిబాబు నేతృత్వంలో విద్యుత్ నాలుగు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ సంబంధ సమస్యలను తొలగించారు. దీంతో ఉదయం 10 నుంచి సాయంత్రం 8 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపేశారు. ఒక రోజు ముందుగా ఈ విషయం తెలపడంతో వినియోగదారులకు పెద్దగా ఇబ్బందులేమి లేవని ఏఈ తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

అయినవిల్లి: ఓ విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించి వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. అయినవిల్లిలంకకు చెందిన ఓ బాలిక అయినవిల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ బాలికను అయినవిల్లిలంక గ్రామానికి చెందిన కొమ్మాబత్తుల వైజయంతికుమార్ అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా, ఆ బాలికను ప్రేమించమని వేధింపులకు గురిచేస్తున్నాడు. గతంలో కూడా ఆమెను ఇలాగే వేధించాడని గ్రామంలో పెద్దల సమక్షంలో జయంతికుమార్‌ను హెచ్చరించినా అతడి తీరు మారలేదన్నారు. దీనిపై విద్యార్థిని తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రహదారి పనుల పరిశీలన


నాగుల్లంక వద్ద ఆర్‌పీ రోడ్డు ఆధునీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ఎల్.గన్నవరం నుంచి చాకలిపాలెం సెంటర్ వరకూ జరుగుతున్న ఆర్‌పీ రోడ్డు ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శుక్రవారం పరిశీలించారు. బీటీ రోడ్డుపై రెండో లేయర్ నిర్మాణ పనులను ఆయన తిలకించారు. పనుల ప్రగతిని ఆర్‌అండ్‌బీ ఏఈ రాజేంద్రను అడిగి తెలుసుకున్నారు. చిట్టిబాబు మాట్లాడుతూ సోమవారం సాయంత్రానికి మొత్తం ఈ రోడ్డు పనులు పూర్తవుతాయని వివరించారు. పి.గన్నవరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి సెంటర్ వరకూ సీసీ రోడ్డుకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. 10 రోజుల్లో ఆ పనులు ప్రారంభం అవుతాయన్నారు. అక్కడి నుంచి అక్విడెక్టు వరకూ బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. అలాగే పి.గన్నవరం నుంచి జి.పెదపూడి వరకూ రూ.24 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాబోతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా ఉచ్చులవారిపేట నుంచి జి.పెదపూడి వరకూ 700 మీటర్ల మేర పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు.

వచ్చేనెల 1 నుంచి రోడ్డు బెల్లంపూడి రోడ్డు బంద్

ఉచ్చులవారిపేట నుంచి జి.పెదపూడి వరకూ 700 మీటర్ల మేర సీసీ, బీటీ రోడ్డు నిర్మాణ పనుల కారణంగా ఫిబ్రవరి 1 నుంచి 21 వరకూ రాకపోకలను నిలిపివేస్తున్నట్టు ఆర్‌అండ్‌బీ ఏఈ రాజేంద్ర తెలిపారు. బెల్లంపూడి నుంచి జి.పెదపూడి వరకూ ఆ రోడ్డును బంద్ చేస్తున్నామని, ప్రయాణికులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉచిత వైద్య శిబిరం

రావులపాలెం: స్థానిక సత్యసాయి సేవా మందిరంలో శుక్రవారం విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి, పంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని రావులపాలెం ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అమలాపురం ఆయుష్ డెంటల్ కేర్, రాజమహేంద్రవరం అకీరా కంటి వైద్యులు వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్టు సంఘ సెక్రటరీ పి.గోపాలకృష్ణమూర్తి తెలిపారు.

పిచ్చుకలంక పర్యాటక స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్రేయపురం: మండలంలోని పిచ్చుకలంకను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కేటాయించిన స్థలాన్ని టూరిజం శాఖ ఈఈ ఎంవీ రామారావు, ఆర్డీవో ఎం.ముక్కంటి, ఎంపీడీవో నాతిబుజ్జి, తహసీల్దార్ అనిల్‌కుమార్‌తో పాటు పర్యాటక, ఇరిగేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలిచ్చారు. అనంతరం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు.